
JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । గురువారం 25-12-2025
Medchal - Malkajgiri । Thursday 25-12-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 209 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 209 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


## ప్రధానిగా ప్రియాంక పేరు..



**జయభేరి, న్యూఢిల్లీ, డిసెంబర్ 24:**

కాంగ్రెస్ పార్టీలో నాయకత్వంపై గత కొన్నేళ్ల నుంచి చర్చలు జరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా ఉండగా, రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రతిపక్షనేతగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడు ఇమ్రాన్ మసూద్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారితీశాయి. ఆయన ప్రియాంక గాంధీ వాద్రాను ఇండి కూటమి ప్రధాని అభ్యర్థిగా సూచిస్తూ, ఆమె నాయకత్వాన్ని మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో పోల్చడంలో రాజకీయాలు హీటెక్కాయి. దీనిపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఢిల్లీ హజ్ కమిటీ చైర్‌పర్సన్ కౌసర్ జహాన్ ఓ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకత్వంపై నేరుగా విమర్శలు చేశారు. రాహుల్ గాంధీ అయినా, ప్రియాంక గాంధీ అయినా.. వారిద్దరి రాజకీయ స్థాయి ఇప్పుడు ప్రధాని పదానికే కాదు, రాష్ట్రాల్లో పరిమిత సీట్లు సాధించే స్థాయి కూడా లేదన్నారు. ఎవరైనా వాస్తవాలకు దూరంగా ఉండి ముంగేరిలాల్ కలలు కనాలనుకుంటే కనవచ్చు అని కౌసర్ జహాన్ అన్నారు. దేశ ప్రజలు ప్రధానిగా నరేంద్ర మోడీపై విశ్వాసం ఉంచారని, మరికొన్ని సంవత్సరాల వరకు ఈ పదవికి ఎలాంటి ఖాళీ లేదని ఆమె అన్నారు.ఇమ్రాన్ మసూద్ వ్యాఖ్యల ద్వారా కాంగ్రెస్, గాంధీ కుటుంబంలో అంతా సవ్యంగా లేదని తెలుస్తోందని ఆమె అన్నారు. పార్టీ, కుటుంబంలో వేర్వేరు ...మిగతాది 2 లో



తెలంగాణలోని 12,706 గ్రామ పంచాయతీలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుభవార్తను అందించారు. ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుంచి గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద అదనంగా నిధులు అందిస్తామని ప్రకటించారు. మేజర్ గ్రామ పంచాయతీలకు 10 లక్షల చొప్పున, చిన్న గ్రామ పంచాయతీలకు 5 లక్షల రూపాయల చొప్పున స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌గా నిధులు ఇందజేస్తామని చెప్పారు.

## పంచాయతీలకు సీఎం నజరానా

- మేజర్ గ్రామ పంచాయతీలకు 10 లక్షల చొప్పున
- చిన్న గ్రామ పంచాయతీలకు 5 లక్షల రూపాయల చొప్పున
- రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో..
- వచ్చే ఏడాది నుంచి రాష్ట వ్యాప్తంగా పిల్లలకు టిఫిన్‌తో పాటు మధ్యాహ్న భోజనం
- ప్రతి ఇంటికి రేషన్ కార్డు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిది : సిఎం రేవంత్ రెడ్డి

**జయభేరి, నారాయణపేట (కోస్గి) డిసెంబర్ 24 :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులకు ఈ నిధులు అదనమని స్పష్టం చేశారు. నూతన సంవత్సరంలో ఈ ప్రత్యేక నిధులను అందజేస్తామని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా గ్రామ సర్పంచులకు ప్రజల్లో గౌరవం, మర్యాద పెంచుతుందని చెప్పారు. గ్రామ సభలు పెట్టుకుని అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, గ్రామాల్లో ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవడానికి దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

కొడంగల్ శాసనసభ నియోజకవర్గంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్ల కోసం కోస్గి కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీ ప్రతినిధులను ముఖ్యమంత్రి సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ...మిగతాది 2 లో

## విద్యార్థినీలతో కలిసి భోజనం చేసిన డిప్యూటీ సీఎం



- గిరిజన బాలికల గురుకుల కళాశాలలో ఆకస్మికంగా పర్యటించిన డిప్యూటీ సీఎం
- వసతి సౌకర్యాలు, బోధన నాణ్యత పై విద్యార్థులను ప్రశ్నించిన డిప్యూటీ సీఎం

**జయభేరి, హైదరాబాద్ :**

విద్య, వైద్యం, సంక్షేమ రంగాలపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందుకుగాను ఈ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోంది. ప్రభుత్వ వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం అందించేందుకు 40% డైట్ చార్జీలు సైతం పెంచింది, ప్రత్యేకంగా మెనూ రూపొందించింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు బుధవారం ఖమ్మం కలెక్టరేట్ లో సమీక్ష సమావేశం ముగించుకొని మధిర నియోజకవర్గ పర్యటనకు వెళ్లే క్రమంలో ఆకస్మికంగా ...మిగతాది 2 లో



## బీఆర్ఎస్ తప్పులకు నన్ను క్షమించండి

- నేను తెలంగాణ ప్రజల బాణాన్ని. నన్ను ఎవరో ఆపరేట్ చేసే సీన్ లేదు
- 2029 లో ఎన్నికలు వస్తాయని భావిస్తున్నా. అప్పుడు బరిలో ఉంటాం
- ట్రిపుల్ ఆర్ ప్రాజెక్ట్ లో పెద్దల భూముల కోసం పేదల భూములను బలి పెడుతున్నారు

**జయభేరి, యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 24 :**

తాను తెలంగాణ ప్రజలు వదిలిన బాణాన్నని కల్వకుంట్ల కవిత ప్రకటించారు. తనను ఎవరూ ఆదేశించలేరన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో జాగృతి జనం బాట పర్యటనలో భాగంగా మీడియాతో మాట్లాడారు. తన రాజకీయ భవిష్యత్తు, బీఆర్ఎస్ పార్టీతో తనకున్న ప్రస్తుత సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. 19 ఏళ్లుగా జాగృతి ద్వారా ప్రజల్లోనే ఉన్నానని, 2029 ఎన్నికల్లో ఖచ్చితంగా బరిలో ఉంటానని ఆమె ప్రకటించారు. బీఆర్ఎస్ నుంచి తనను ఎందుకు సస్పెండ్ చేశారో ఇప్పటికీ కారణం తెలియదని, ఉరి వేసే వ్యక్తికి కూడా కారణం చెబుతారని, కానీ తనకు ఆ కనీస సమాచారం కూడా ఇవ్వలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన కొన్ని పొరపాట్లలో తాను కూడా ...మిగతాది 2 లో

## వంజంగి లోకేషన్ కు లోకేష్ ఫిదా



**జయభేరి, విజయవాడ, డిసెంబర్ 24:**

ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని వంజంగి హిల్ స్టేషన్ అందాలను ప్రశంసిస్తూ చేసిన ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రాకేష్ పులప అనే ఫోటోగ్రాఫర్ వంజంగి గురించి అద్భుతమైన ఫోటోలను పంచుకున్నారు. నారా లోకేష్ ఆ ట్వీట్కు రిప్లయ్ ఇచ్చారుఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో వంజంగి ఒక అద్భుతమైన మణిహారంలా మెరుస్తోంది. మంత్రి నారా లోకేష్ వంజంగి అందాలను ఉద్దేశించి చేసిన ట్వీట్ ...మిగతాది 2 లో




## అంతరిక్షంలో ఇస్రో మరో ఘనత

- 6100 కిలోల భారత 'బాహుబలి రాకెట్' సక్సెస్

**జయభేరి, నెల్లూరు, డిసెంబర్ 24:**

అంతరిక్ష రంగంలో ఇస్రో మరో ఘనత సాధించింది. భారత బాహుబలి రాకెట్ ప్రయోగాన్ని విజయవంతంగా ప్రయోగించింది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ వాహకనౌక.. అమెరికాకు చెందిన బ్లూబర్డ్ బ్లాక్2 ఉపగ్రహాన్ని నింగిలోకి తీసుకెళ్లింది. ఈ శాటిలైట్ ప్రపంచవ్యాప్తంగా టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. ఇక భారత గడ్డపై ప్రయోగించిన ...మిగతాది 2 లో

## మేడారంలో గద్దెలపై కొలువుదీరిన పగిడిద్దరాజు, గోవిందరాజులు



- మేడారం జాతర వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు

**జయభేరి, ములుగు డిసెంబర్ 24 :**

మేడారం మహా జాతర కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో గద్దెలపై పగిడిద్దరాజు, గోవిందరాజులు కొలువుదీరారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గోవిందరాజును బుధవారం ఉదయం 6 గంటలకు, పగిడిద్దరాజును 9.45 గంటలకు పూజారులు ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జాతర కార్యనిర్వహణాధికారి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భక్తులను గద్దెల ప్రాంగణంలోకి రానివ్వకుండా భద్రత ఏర్పాట్లు చేపట్టారు. సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులు కుటుంబాలతోపాటు హాజరై పూజా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. మేడారం జాతర వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరుగనుంది. దీనికి తెలంగాణతోపాటు చుట్టుపక్కల ...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## బీఆర్ఎస్ తప్పులకు నన్ను క్షమించండి

భాగస్వామినేనని కవిత బహిరంగంగా అంగీకరించారు. ముఖ్యంగా నిజామాబాద్ ఎంపీగా ఉన్న సమయంలో ఆలేరు ప్రాంత రైతులపై బేడీలు వేసిన ఘటనపై ఆవేదన వ్యక్తంమ చేశారు. అప్పుడు నేను పార్టీలో ఉన్నాను కాబట్టి ఆ పాపంలో నాకు కూడా భాగం ఉంది, అందుకే ప్రజలకు క్షమాపణలు చెబుతున్నాను అని పేర్కొన్నారు. తనను కేవలం నిజామాబాద్‌కే పరిమితం చేయడం వల్ల రాష్ట్రంలోని ఇతర సమస్యలను పట్టించుకోలేకపోయానని, తన ప్రవర్తన ద్వారా మళ్లీ ప్రజల నమ్మకాన్ని గెలుచుకుంటానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టులో భారీ అవినీతి జరుగుతోందని కవిత ఆరోపించారు. పెద్దల భూములను కాపాడటం కోసం పేదల భూములను బలి పెడుతూ అలైన్‌మెంట్లు మార్చుతున్నారని విమర్శించారు. దీనిపై జనవరి 5న హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని, ఆన్‌లైన్ మూమెంట్‌ను కూడా చేపడతామని వెల్లడించారు. బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయినా చుక్క నీరు రాలేదని, నిర్వాసితులకు సరైన పరిహారం అందలేదని ఆమె ప్రభుత్వంపై మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ సీఎం అని, ఆయన అంతర్గతంగా బీజేపీతో కుమ్మక్కయ్యారని విమర్శించారు.భువనగిరి జిల్లాలోని పలు సమస్యలపై కవిత ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎయిమ్స్ భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, అందులోని ఉద్యోగాల్లో స్థానికులకే 80 శాతం అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆలేరులో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం, చేనేత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రూ. 50 కోట్ల నిధుల విడుదల, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు వంటి అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. రాజకీయాల కోసం కాకుండా, కేవలం జనం సమస్యల పరిష్కారం కోసమే జాగృతి పనిచేస్తుందని, జిల్లా పర్యటనల్లో తేలిన ప్రతి సమస్యను పరిష్కారం అయ్యే వరకు ఫాలో అప్ చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

## మేడారంలో గద్దెలపై కొలువుదీరిన..

ఉండే రాష్ట్రాల నుంచి కోటి మందికిపైగా భక్తులు తరలి వస్తారని అంచనా.ఈ సారిగా నూతనంగా నిర్మించిన గద్దెలపై సమ్మక్క, సారలమ్మతోపాటు పగిడిద్ద రాజు, గోవిందరాజులను కొలువుదీర్చుతున్నారు. జాతర ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నారు. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుంది. దాని మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పు ప్రధాన స్వాగత తోరణం ఉంటుంది.పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలను సమ్మక్కసారలమ్మ గద్దెలు ఉండే వరుసలోకి మార్చారు. ఈ ఏర్పాటు ద్వారా భక్తులంతా ఒక వరుసలో దర్శనానికి వెళ్లేందుకు వీలు కలుగనుంది. వృత్తాకారంలో ఉండే గద్దెల చుట్టూ 8 స్తంభాలు ఉంటాయి. వాటి మధ్యలో వెదురు బొంగులతో డెకరేషన్ చేస్తారు.

## ఇస్రో మరో ఘనత

అత్యంత బరువైన ఉపగ్రహంగా ఇది నిలిచింది.అంతరిక్షంలో ఇస్రో మరో ఘనత.. 6100 కిలోల భారత 'బాహుబలి రాకెట్' సక్సెస్భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో).. మరో అద్భుత ఘనతను తన ఖాతాలో వేసుకుంది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన అత్యంత శక్తివంతమైన బాహుబలి రాకెట్ (ఎల్‌వీఎం3ఎం6) (LVM3M6) ద్వారా బుధవారం ఉదయం అమెరికాకు చెందిన బ్లూబర్డ్ బ్లాక్2 భారీ ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఆంధ్రప్రదేశ్ శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ స్టేషన్ రెండో ప్రయోగ వేదిక నుంచి బుధవారం ఉదయం 8:55 గంటలకు ఈ ప్రయోగం చేపట్టారు. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్ తయారు చేసిన 6,100 కిలోల బరువు ఉన్న ఈ బ్లూబర్డ్ బ్లాక్2 శాటిలైట్‌ను.. భారత స్వదేశీ టెక్నాలజీతో రూపొందించిన ఎల్‌వీఎం3ఎం6 వాహకనౌక.. నింగిలోకి తీసుకెళ్లింది. భారత గడ్డ మీది నుంచి ప్రయోగించిన అత్యంత బరువైన ఉపగ్రహంగా ఇది రికార్డు సృష్టించింది.

**బ్లూబర్డ్ శాటిలైట్ ప్రత్యేకతలు**

ఈ బ్లూబర్డ్ శాటిలైట్.. ప్రపంచవ్యాప్తంగా టెలికాం రంగంలో పెను మార్పులను తీసుకురానున్నట్లు ఇస్రో వర్గాలు వెల్లడించాయి. ఇక ఎలాంటి స్పెషల్ డివైజ్‌లు పరికరాలు లేకుండానే సాధారణ స్మార్ట్‌ఫోన్‌లకు నేరుగా అంతరిక్షం నుంచి 4జీ, 5జీ బ్రాడ్‌బ్యాండ్ సేవలను ఈ బ్లూబర్డ్ శాటిలైట్ అందిస్తుంది. ఇది అంతరిక్షంలో దాదాపు 2400 చదరపు అడుగుల విస్తీర్ణంలో తన యాంటెన్నాలను కలిగి ఉంటుంది. ఇది భూమికి దిగువ కక్ష్యలోనే అతిపెద్ద కమర్షియల్ కమ్యూనికేషన్ వ్యవస్థ కావడం విశేషం.

**90 సెకన్ల జాప్యం ఎందుకు?**

షెడ్యూల్ ప్రకారం ఉదయం 8:54 గంటలకే ఈ ప్రయోగం జరగాల్సి ఉంది. కానీ ఇది 90 సెకన్ల పాటు ఆలస్యమైంది. అంతరిక్షంలో అప్పటికే తిరుగుతున్న ఇతర ఉపగ్రహాలు లేదా శకలాలతో ఢీకొనే ప్రమాదం ఉందని గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తలు.. ముందు జాగ్రత్తగా ఈ ప్రయోగాన్ని కొద్దిసేపు వాయిదా వేసి 8:55:30 గంటలకు రాకెట్‌ను నింగిలోకి పంపించారు.భారత బాహుబలి రాకెట్ నింగిలోకి విజయవంతంగా చేరడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. భారత అంతరిక్ష రంగంలో ఇదొక గొప్ప మైలురాయి అని అభివర్ణించారు. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తికి ఇది నిదర్శనమని.. భారత శాస్త్రవేత్తల కృషి గర్వకారణమని కొనియాడారు. ఇది ఎల్‌వీఎం3 రాకెట్ మూడో పూర్తి వాణిజ్య ప్రయోగమని.. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ వెల్లడించారు. 52 రోజుల స్వల్ప వ్యవధిలోనే 2 భారీ ప్రయోగాలను చేపట్టడం.. ఇస్రో సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. నవంబర్ 2వ తేదీన సీఎంఎస్03 (CMS03) ప్రయోగాన్ని చేపట్టింది. ఇదే ఎల్‌వీఎం3 రాకెట్ గగన్‌యాన్ మిషన్‌కు కూడా పునాది అని ఇస్రో ఛైర్మన్ తెలిపారు.ఈ ఎల్‌వీఎం3 రాకెట్ 43.5 మీటర్ల ఎత్తు.. 640 టన్నుల బరువు కలిగి ఉంటుంది. ఈ రాకెట్‌లో మూడు ఇంజిన్లు ఉంటాయి. మొదటి దశలో ఘన, రెండో దశలో ద్రవ, మూడో దశలో క్రయోజెనిక్ ఇంజిన్లు ఉంటాయి. గతంలో వన్‌వెబ్ ఉపగ్రహాలను మోసుకెళ్లిన రికార్డును అధిగమించి.. ఇప్పుడు 6.1 టన్నుల భారంతో అగ్రస్థానంలో నిలిచింది

## వంజంగి లోకేషన్ కు లోకేష్ ఫిదా

ఈ ప్రాంత ప్రాముఖ్యతను మరోసారి చాటిచెప్పింది. "వంజంగి ఎప్పుడూ ఆశ్చర్యపరచడంలో విఫలం కాదు.. మంత్రముగ్ధులను చేసే మేఘాల పొరలు, బంగారు కాంతులు, మాటల్లో వర్ణించలేని ప్రశాంతత.. ఇది ప్రకృతి ప్రసాదించిన అద్భుతం" అంటూ ఆయన వంజంగిని ఆకాశానికెత్తారు. సముద్ర మట్టానికి సుమారు 3400 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ప్రాంతం, ప్రస్తుతం దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఆదరణ పొందుతున్న పర్యాటక కేంద్రంగా మారింది. వంజంగి ప్రధాన ఆకర్షణ ఇక్కడి సూర్యోదయం . తెల్లవారుజామున సూర్య కిరణాలు పడుతుంటే, కొండల మధ్య దట్టంగా అలుముకున్న మేఘాలు సముద్రపు అలలలా కనిపిస్తాయి. అందుకే పర్యాటకులు దీనిని 'మేఘాల సముద్రం' (Sea of Clouds) అని పిలుస్తుంటారు. ఆకాశంలో బంగారు రంగులు చిమ్ముతూ సూర్యుడు ఉదయిస్తుంటే, ఆ మంచు తెరల మధ్య ప్రకృతి రమణీయత పర్యాటకులను మరో లోకంలోకి తీసుకెళ్తుంది. ముఖ్యంగా శీతాకాలంలో ఇక్కడి ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోయి, కాశ్మీర్‌ను తలపించే వాతావరణం నెలకొంటుంది. వంజంగి కేవలం ప్రకృతి ప్రేమికులకే కాకుండా, సాహస యాత్రికులకు, ట్రెక్కర్స్‌కు కూడా ఇష్టమైన ప్రదేశం. సుమారు 5 కిలోమీటర్ల మేర కొండ మార్గంలో ట్రెక్కింగ్ చేస్తూ శిఖరాగ్రానికి చేరుకోవడం ఒక మధురమైన అనుభూతినిస్తుంది. అరకు, లంబసింగి వంటి ప్రాంతాలకు దగ్గరగా ఉండటం వల్ల పర్యాటకులు ఈ ప్రాంతానికి రావడానికి మొగ్గు చూపుతున్నారు. పర్యాటక శాఖ కూడా ఇక్కడ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టడంతో, గత రెండేళ్లుగా పర్యాటకుల రద్దీ గణనీయంగా పెరిగింది.లోకేష్ చేసిన ట్వీట్ వల్ల వంజంగికి జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'ఎకో టూరిజం'ను ప్రోత్సహిస్తున్న తరుణంలో, వంజంగి వంటి ప్రాంతాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తే రాష్ట్ర ఆదాయంతో పాటు స్థానిక గిరిజనులకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయి. ప్రకృతిని ప్రేమిస్తూ, ప్రశాంతతను కోరుకునే వారికి వంజంగి సందర్శన ఒక మరపురాని జ్ఞాపకంగా మిగిలిపోతుందనడంలో సందేహం లేదు.

# ప్రేమ సందేశమే.. క్రీస్తు జననం...



✍ జయభేరి, హైదరాబాద్ :

సర్వ మానవాళి పాపపరిహారార్థం ఏసుక్రీస్తు ఈ లోకానికి లేఖనముల ప్రకారంగా జన్మించాడు. ప్రపంచ దేశాలన్నీ సగర్వంగా డిసెంబర్ 25వ తేదీన ఏసుక్రీస్తు జన్మదినాన్ని అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. వేల సంవత్సరాల క్రితం ఏసుక్రీస్తు లేఖనాల ప్రకారంగా కన్య మరియ గర్భాన ధరించి శిశువుగా ఈ లోకానికి పరిచయం అయ్యారు. తాను బ్రతికిన 35 సంవత్సరాలు ఏసుక్రీస్తు సహోదర ప్రేమను చాటుతూ సర్వ మానవాళికి సత్య వాక్కును ప్రకటిస్తూ ప్రేమ దయ కరుణ కృప ఇలాంటి పదాలకు సరైన అర్థాన్ని చూపించారు. ఏసుక్రీస్తు ఒక ప్రవక్తగా ఈ భూమి మీదకి రావడం జరిగింది. తాను నివసించిన సంవత్సరములన్నింటినీ బైబిల్ ప్రకారంగా ఆయన అనుచరులు లేఖనములు రాసి బైబుల్ గ్రంథాన్ని ఈ ప్రపంచానికి అందజేశారు. ప్రేమతో ఏదైనా సాధించవచ్చు అన్న నిజాన్ని ఈ ప్రపంచానికి ప్రేమను పరిచయం చేసిన ప్రభువైన యేసుక్రీస్తు సహోదర ప్రేమను ఈ ప్రపంచానికి తెలియజేశారు.

**ఏసుక్రీస్తు శిశువుగా రావడానికి అసలు కారణం ఏమిటి...??**

సర్వ మానవాళి పాపపరిహార్థంగా బలి అయిన గొర్రెపిల్ల అని లేఖనముల ప్రకారంగా ఆయన కన్య మరియ గర్భాన శిశువుగా జన్మించారు. గాబ్రియేలు దూత గొల్లలకు మీకు ఒక శుభవార్త మానము అంటూ యేసుక్రీస్తు రాకడను తెలియజేసింది. అలాగే జ్ఞానులకు నింగిలో తార వెలసి దారి చూపించింది. అంటే ప్రకృతి మొత్తం యేసు క్రీస్తుకు దాసోహంగా మారి ఆయన జన్మదినాన్ని ఘనంగా జరుపుకునేలా ఈ ప్రపంచానికి మాదిరిగా చూపించింది. ఏసుక్రీస్తు మానవతారీగా ఈ భూమ్మీదికి వచ్చినప్పుడు ఆయనకు ఈ భూమ్మీద ఎక్కడ చోటు లేక సత్రంలో ఆయన జననం జరిగింది. పశువుల పాకలో ఆయనను పరుండ పెట్టిన తర్వాత ఆయన సర్వోన్నతుడైన తండ్రి కుమారుడిగా రాలేదు కడు బీద వానిగా ఈ లోకానికి ఆయన రావడం జరిగింది. ఏసు అంటే రక్షకుడు అని అర్థం. ప్రజల పాపపరిహారం ప్రజలకు నిత్య సువార్తను ప్రకటించేందుకు ఆయన వాక్యాన్ని నేటి వరకు ప్రపంచం మొత్తం అత్యధికంగా అమ్ముడుపోయే పుస్తకం ఏదైనా ఉంది



✍ కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

అంటే అది బైబిల్ మాత్రమే...
పవిత్ర బైబిల్ లో ఎవరిని చంపడం హింసించడం పాత నిబంధనలో మాత్రమే చూస్తాము. కానీ ఏసుక్రీస్తు వచ్చిన తర్వాత క్రొత్త నిబంధన ఏర్పడిన పిమ్మట ఎక్కడ చూసినా మనకు క్షమాపణ ప్రేమ దయ కరుణ దాతృత్వం ఇవే కనిపిస్తాయి.. ఏసుక్రీస్తు రూపాన్ని చూసిన ప్రతి ఒక్కరూ ఆయన వాక్యానికి లోబడి తమ జీవితాలను పరిశుద్ధంగా మలుచుకుంటారు. ఏసుక్రీస్తు యవ్వనుడిగా ఉన్నప్పుడు ఆలయంలో వ్యాపార లావాదేవీలు జరుగుతున్న పరిసర ప్రాంతాలను గమనించి ఇవి దేవుని ఆలయాల లేకపోతే ఇవి సత్రాల అంటూ ఆయన ఘాటుగా స్పందించినట్టు బైబిల్ లో మనం చూస్తాం. అంటే ఏసుక్రీస్తు తనను తాను తగ్గించుకొని, పరిశుద్ధుడిగా ఈ లోకానికి మానవ దారిగా అవతరించి ఈ లోకానికి ప్రేమను పరిచయం చేసిన మహోన్నత ప్రవక్త తండ్రి కుమారుడు యేసుక్రీస్తు..
రాజులకు రాజుగా ప్రభువులకు ప్రభువుగా ఆయన ఆ పరలోకాన్ని వీడి మానవుల పాప భారాన్ని తొలగింప చేయుటకు ఆయన డిసెంబర్ 25 నా జన్మించారని క్రైస్తవులు నమ్ముతూ ఆయన జన్మదినాన్ని పండుగలా జరుపుకుంటారు. క్రీస్తు జననం సర్వలోకానికి వెలుగు ప్రకాశించినట్టుగా భావిస్తారు. నిజమే కదా ఒకరినొకరు సహోదరునిగా ప్రేమించుకొనవలెను అని బైబిల్ వాక్యం ఇవాళ ప్రతి ఒక్కరికి సూక్తిగా మారలేదా.. కుల మతం అని విద్వేషాలు రెచ్చగొట్టే ఈ సమాజంలో యేసు క్రీస్తు యొక్క ప్రేమను అందరూ రుచి చూసిన తర్వాత తమ నడత మాట బ్రతుకు వ్యక్తిత్వం అన్ని మార్చుకుంటారు. ఇది బైబిల్ చదివిన ప్రతి వ్యక్తికి అర్థమవుతుంది. ప్రస్తుతం నేటి సమాజంలో యేసు క్రీస్తు ప్రేమను అందించాల్సిన తరుణం ఎంతైనా ఉంది. ఆయన పంచిన ప్రేమ దయ కరుణ వాత్సల్యం ప్రతి ఒక్కటి ఈనాటి సమాజానికి అవసరం. అందుకే ఏసుప్రభు యొక్క జన్మదినం ప్రపంచానికి పర్వదినంగా మారింది. క్రీస్తు ఈ లోకానికి సత్యమార్గాన్ని చూపించిన ప్రభువులకు ప్రభువు. అని నాటినుండి నేటి వరకు ప్రపంచ దేశాలన్నీ ఆయన నామాన్ని కీర్తిస్తూ ఆయనకు ప్రార్థన చేసిన ప్రతి ఒక్కరూ తమ తమ జీవితాల్లో ఉన్నతమైన స్థానానికి ఎదుగుతున్న అనేక సందర్భాలు మనం చూడవచ్చు. అందుకే 2025 క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని జయభేరి పత్రిక ప్రేక్షకులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తుంది.

## పంచాయతీలకు సీఎం నజరానా

“ప్రభుత్వం సర్పంచులకు అండగా నిలుస్తుంది. మార్చి 31 లోపు గ్రామ పంచాయతీలకు రావలసిన 3 వేల కోట్ల రూపాయలను తెప్పించే బాధ్యత తీసుకుంటా. గ్రామ సభలు పెట్టుకుని కార్యాచరణ రూపొందించుకుని అభివృద్ధి సాధించుకోవాలి. ఎన్నికలు ముగిసాయి. పార్టీలు పంథాలు ఎన్నికల సమయంలోనే. ప్రతి పౌరుడు మన కుటుంబ సభ్యుడే. ఎవరి పట్ల వివక్ష చూపరాదు. చెబితే వినలేదనో, ఎన్నికల్లో పోటీ చేశారనో ప్రత్యర్థులు గెలిచారనో కారణంగా వివక్ష చూపించరాదు. చిన్న చిన్న అభిప్రాయబేధాలు ఉంటే పక్కన పెట్టాలి. రాష్ట్రంలో పడావు పెట్టిన ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా ప్రారంభిస్తున్నాం. అనుమతులు సాధిస్తున్నాం. గత ప్రభుత్వంలో చేసిన 8 లక్షల కోట్ల అప్పులున్నాయి. ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరిస్తున్నాం. బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, ఎస్ఎల్‌బీసీ, పాలమూరు రంగారెడ్డి, మక్తల్ నారాయణపేట ప్రాజెక్టులేవీ గత పదేళ్లలో పూర్తి చేయలేదు. చుక్క నీరివ్వలేదు. వాటన్నింటినీ చేపడుతాం. చదువు ఒక్కటే నిరుపేదల జీవితాలను మార్చగలదు. అందుకే వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం అందించే కార్యక్రమం చేపట్టబోతున్నాం.
పేదలకు నాణ్యమైన విద్య, ఉన్నత ప్రమాణాలు కల్పించినప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారు. ప్రజలు ఆశీర్వదించి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్నాం. గతంలో ఎప్పుడూ లేని విధంగా రాష్ట్రంలో అర్హులైన వారందరికీ కొత్తగా రేషన్ కార్డులు ఇచ్చాం. ఇంకా ఎవరికైనా రాకపోతే సర్పంచులు ఇళ్లిళ్లు తిరిగి తేల్చితే ఇంకా రేషన్ కార్డులు రానివారికి ఇప్పించే బాధ్యత ప్రభుత్వానిది. అర్హులైన ప్రతి పేద వాడికి సన్నబియ్యం అందాలి. రాష్ట్రంలో 3.10 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. ఇంకా ఎవరికైనా రాకపోతే అందరికీ ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా 200 యూనిట్లలోపు వాడుకున్న వారికి ఉచిత విద్యుత్ అందకపోతే ఆ కుటుంబాల పేర్లను కూడా రాసుకోండి. రాష్ట్రంలో 69 లక్షల మంది రైతులకు రైతు భరోసా అందించాం. ఇంకా ఎవరికైనా ఆ జాబితాలో పేర్లు రాకపోతే వారి పేర్లను కూడా నమోదు చేయండి. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. ఎవరైనా ఎక్కడైనా ప్రయాణం చేసినప్పుడు డబ్బు అడిగితే చెప్పండి. తెలంగాణ ఆడబడ్డలు కోటిమందికి కోటి ఇందిరమ్మ చీరలను సారెగా అందించాలని నిర్ణయించాం. రాష్ట్రంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డకు చీర అందాలి. ఎవరికైనా అందకపోతే సర్పంచులు స్వయంగా వారి పేర్లను నమోదు చేయాలి. ప్రతి ఇంటికీ చీర చేయాల్సిందే. ప్రతి తండాకు, గ్రామానికి రోడ్లు, బడి, గుడి, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడమే కాకుండా పిల్లల భవిష్యత్తు కోసం నాణ్యమైన చదువులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి కొడంగల్‌ను ఒక పెద్ద పారిశ్రామికవాడగా అభివృద్ధి చేసుకుంటున్నాం. కొడంగల్‌ను దేశానికి ఒక మాడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం. జూనియర్, డిగ్రీ, అగ్రికల్చర్, మెడికల్ కాలేజీలతో పాటు సైనిక్ స్కూల్ ను ఏర్పాటు చేస్తున్నాం. మొత్తంగా 250 ఎకరాల్లో కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దబోతున్నాం.
కొడంగల్ శాసనసభ నియోజకవర్గంలో 180 గ్రామ పంచాయతీల్లో ప్రజల తీర్పును గౌరవించి ఎన్నికైన గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లను ప్రత్యక్షంగా కలవాలని, అభినందించాలని, వారు తిరిగి గ్రామాలకు వెళ్లి ప్రజల విశ్వాసాన్ని, నమ్మకాన్ని నిలబెట్టుకుని ప్రజా సేవ చేయాలని ఈ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నాం. కొడంగల్ ప్రజలు నిండుమనసుతో ఆశీర్వదించి గుండెల్లో పెట్టుకుని భుజాలపై మోసినందునే ఈరోజు ముఖ్యమంత్రిని కాగలిగాను.” అని అన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి వాకిటి శ్రీహరితో పాటు జిల్లాకు చెందిన శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, కొత్తగా ఎన్నికైన నియోజకవర్గంలోని గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డుమెంబర్లతో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థినీలతో కలిసి భోజనం చేసిన డిప్యూటీ సీఎం

కొనిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో ఆకస్మికంగా పర్యటించారు. డిప్యూటీ సీఎం కాన్వాయ్ ఒకసారి గా గురుకుల వసతి గృహం వైపు తిరిగింది. డిప్యూటీ సీఎం నేరుగా గురుకుల వసతి గృహంలోకి వెళ్లి మొదట భవనాన్ని పరిశీలించారు, తదుపరి విద్యార్థులు, ప్రిన్సిపల్ తో మాట్లాడారు. విద్యార్థుల సంఖ్య ఎంత ఉంది, మెనూ చార్ట్ ఎక్కడ, మెనూ పాటిస్తున్నారా? లంచ్ టైం ఎన్ని గంటలకు? ఈరోజు మెనూ ఏంటి? ఈ కళాశాలలో చదువుకొని బయటికి వెళ్లిన విద్యార్థినీలు ఏఏ రంగాల్లో స్థిరపడ్డారు తదితర సమాచారం సేకరిస్తున్నారా? లేదా? వంటి వివరాలను ప్రిన్సిపల్ను అడిగి తెలుసుకున్నారు. తదుపరి డైనింగ్ రూమ్ లోకి వెళ్లి వంట పాత్రలను తనిఖీ చేశారు. ఆ తర్వాత విద్యార్థినీలతో కలిసి భోజనం చేశారు.
భోజనం సమయంలో విద్యార్థినీలు ఏఏ ప్రాంతాల నుంచి వచ్చారు, స్థానికంగా విద్యాబోధన ఎలా ఉంది, రోజు మెనూ పాటిస్తున్నారా లేదా అనే ప్రశ్నలు వేసి సమాచారం అడిగి తెలుసుకున్నారు. భోజనాల తదుపరి లైబ్రరీ నీ సందర్శించారు. గ్రూప్ వన్, గ్రూప్ టు వంటి పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారా? పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ లైబ్రరీలో ఉందా లేదా? అడిగి తెలుసుకున్నారు. దోమలు రాకుండా సువాసనలు వెదజల్లే అగరవత్తులను విద్యార్థినిలు తయారు చేస్తున్న విధానాన్ని డిప్యూటీ సీఎం పరిశీలించారు. పిల్లలు తయారు చేసే అగరవత్తులను బ్రాండింగ్ చేసి మార్కెట్లో విక్రయించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ ను ఆదేశించారు. విద్యార్థుల హెల్త్ కార్డులు ఉన్నాయా? లేదా? అని ప్రశ్నించగా విద్యార్థుల హెల్త్ యాప్ ను స్థానిక ప్రిన్సిపల్ డిప్యూటీ సీఎం కు వివరించారు. చివర్లో విద్యార్థినీలు తాము వేసిన పెయింటింగ్ ను డిప్యూటీ సీఎంకు బహుకరించారు, ఆ తర్వాత డిప్యూటీ సీఎం గురుకులంలో మొక్కలు నాటారు. ఎటువంటి సమాచారం లేకుండా అకస్మాత్తుగా గురుకులంలో పర్యటించడంపై సర్వత్ర ఆసక్తి నెలకుంది.

## ప్రధానిగా ప్రియాంక పేరు..

అధికార కేంద్రాలు ఏర్పడ్డాయని, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ రాజకీయ కోణం, దిశ ఒకేలా లేవన్నారు. కాంగ్రెస్ పార్టీ కోమాలో ఉందని, తక్షణం రాజకీయ చికిత్స అత్యవసరమని కౌసర్ జహాన్ సెటైర్లు వేశారు.

**ప్రియాంక గాంధీకి మద్దతుగా ఇమ్రాన్ బహిరంగ వ్యాఖ్యలు**

కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్, బీజేపీ ఆరోపణలకు స్పందించారు. ప్రియాంక గాంధీ బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతున్న హింసపై గతంలో కూడా గళమెత్తారని గుర్తుచేశారు. అలాంటి సందర్భాలలో ప్రియాంక గాంధీ అత్యంత స్పష్టమైన, బలమైన గళం వినిపించారని పేర్కొన్నారు. ప్రియాంక గాంధీని ప్రధాని అభ్యర్థిగా చేస్తే, ఆమె దివంగత ప్రధాని ఇందిరా గాంధీలాగే నిర్ణయాత్మక సమాధానం ఇవ్వగలరని మసూద్ అన్నారు.ఇమ్రాన్ మసూద్ తన వ్యాఖ్యలలో, ఇందిరా గాంధీ దేశ ప్రయోజనాల కోసం పెద్ద నిర్ణయాలు తీసుకుని చరిత్ర సృష్టించినట్లే, ప్రియాంక గాంధీ కూడా భారత్ వ్యతిరేక శక్తులకు గట్టి సమాధానం ఇచ్చే దమ్ము ఉందన్నారు. ప్రియాంక గాంధీ నాయకత్వం దేశానికి వ్యతిరేకంగా కుట్ర చేసేవారికి మళ్లీ అవకాశం ఇవ్వదని, మిత్ర పక్షాలు ఇది గుర్తుంచుకోవాలి అన్నారు.కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ఒకే సిద్ధాంతానికి చెందినవారిగా పేర్కొన్నారు. వారిద్దరినీ వేర్వేరుగా చూడకూడదని, ఒకే తీరుగా ఆలోచిస్తారని అన్నారు. వారి ప్రకారం, ఇద్దరూ ఇందిరా గాంధీ వారసత్వానికి ప్రతినిధులు అని, ఒకరికొకరు వేరుగా కాకుండా సమష్టిగా పాత్ర ఉంటుందని పేర్కొన్నారు.




## సత్య బోధనే క్రీస్తు చెప్పిన మార్గం

● ప్రేమ దయ కరుణ ఆయన చూపిన సన్మార్గం

✍ జయభేరి, శాలిగౌరారం :

ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 25 అంటే క్రీస్తు జననం అని క్రైస్తవ సమాజం ఆయన పుట్టినరోజును ఘనంగా జరుపుకుంటుంది. ప్రపంచ శాంతి కోసం సర్వమానవాళి పాపపరిహారం ఆయన శిలువలో మరణించడానికి లేఖనముల ప్రకారం ఆయన నరరూప దారిగా కన్య మరియ గర్భణ జన్మించిన పరిశుద్ధాత్ముడు ఏసుక్రీస్తు..
భూమ్మీద ఎన్ని దేశాలు ఉన్నాయో ఆ దేశాలన్నీ పూర్తిగా సర్వ సుందరంగా అలంకరింపబడి క్రీస్తు జన్మదినాన్ని జరుపుకుంటారు.. వాక్యానుసారం పాపపరిహారార్థం బలియాగపు గొర్రెపిల్లగా యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చాడని సర్వ మానవాళి యొక్క పాపాన్ని కలువరి సిలువలో తన రక్తం కార్చి పరిశుద్ధులుగా మార్చారని క్రైస్తవుల నమ్మకం... అంతేకాకుండా జాలి దయ కరుణ ప్రేమ ఇలాంటి ఎన్నో పదాలను మనం బైబుల్లో చూడవచ్చు. అలాంటి ప్రేమ దయ కరుణ ఒకరిపై ఒకరికి సహోదర ప్రేమను చూపించినట్లైతే సమాజంలో పరిశుద్ధ వాతావరణం నెలకొని అలజడులు అల్లరులు ఏమీ లేకుండా ప్రజా పాలన నిరాటంకంగా కొనసాగుతోంది... ఆ దిశగా ప్రపంచం మొత్తం సర్వ మానవాళి శాంతి సందేశాన్ని అందించినటువంటి కరుణామయుడు ఏసుక్రీస్తు జన్మదిన జరుపుకుంటున్న ప్రతి ఒక్కరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంబటి రమేష్ శాలిగౌరారం జిల్లా నల్లగొండ. గ్రామం ఇటుకుల పహాడ్ గ్రామంలో 8వ వార్డు మెంబర్గా ఎన్నికైన సందర్భంగా క్రైస్తవ సమాజానికి మొత్తం ఆయన క్రిస్మస్ యొక్క శుభాకాంక్షలు అందించారు.

# యాదగిరిగుట్టలో కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు

- శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్యరాబడి రూ.20.17లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట, డిసెంబర్ 24:**



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున యాదగిరికొండపై ఉన్న ముఖమండపం ఉత్తర భాగంలోని హాల్‌లో గోదాదేవి అమ్మవారిని వేంచింపజేసి తిరుప్పావై కార్యక్రమాన్ని అర్చకులు వేదోక్తంగా నిర్వహించారు. ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకొని శ్రీగోదాదేవికి విశేష తిరువారాధన, తిరుప్పావై సేవాకాలము, శాత్తుమొరైని నిర్వహించారు. మహిళా భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారికి మంగళహారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ధనుర్మాస విశిష్టతను అర్చకులు భక్తులకు వివరించారు.

**యాదగిరీశుడికి నిత్యపూజలు..**

శ్రీ లక్ష్మినరసింహ స్వామి వారికి నేత్రపర్వంగా నిత్య పూజలు కొనసాగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్యకల్యాణం, నిత్యబ్రహ్మోత్సవం,వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా బుధవారం రూ.20,17,449 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.92,250, బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,63,200, వీఐపీ దర్శనం ద్వారా రూ.2,85,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.3,46,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.60,632, ప్రసాద విక్రయం ద్వారా రూ.8,11,700,కల్యాణకట్ట ద్వారా రూ.35,000తో పాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆలయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

**నరసింహ స్వామి వారికి బ్యాటరీ వాహనం అందజేత..**

శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి బ్యాటరీ వాహనాన్ని భక్తుడు అందజేశాడు. రూ.7.50 లక్షల విలువైన బ్యాటరీ వాహనాన్ని భువనగిరి మండలం అనాజిపురం గ్రామానికి చెందిన భక్తుడు పన్నాల సుభాషిని వెంకట్ రాంరెడ్డి దంపతులు ఆయన తండ్రి లక్ష్మీనరసింహారెడ్డి జ్ఞాపకార్థం అందజేశారు.

**స్వామి వారికి ఆరాధన పాత్రలు..**

పాతగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారికి వెండి ఆరాధన పాత్రలను సికింద్రాబాద్ వారాసిగూడకు చెందిన భక్తుడు బూస కృష్ణ అందజేశారు. సుమారు రూ.2.50 లక్షల విలువైన కిలో 106 గ్రాముల వెండి ఆరాధన పాత్రలు బుధవారం ఆలయ అధికారులకు అందజేశారు.

# ఆర్టీసీ లాభాల బాటలో నడిచినప్పుడే ఉద్యోగుల భద్రత

- రీజినల్ మేనేజర్ ఎన్. సుచరిత

**జయభేరి, మేడిపల్లి :**



ఆర్టీసీ సంస్థ పురోగతి, లాభాల సాధన కోసం ప్రతి ఉద్యోగి నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆర్టీసీ సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ ఎన్.సుచరిత అన్నారు. చెంగిచెర్ల ఆర్టీసీ డిపోను బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించి విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. డిపోలో బస్సుల నిర్వహణ, మెయింటెనెన్స్ విధానం, కార్యాలయ పనితీరు, స్టోర్, ఆయిల్ సెక్షన్‌తో పాటు డిపో పరిసరాల పరిశుభ్రతను ఆమె పరిశీలించారు. బస్సుల ఫిట్‌నెస్, టైమ్ టేబుల్ అమలు, రికార్డుల నిర్వహణపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిపో సిబ్బందితో ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీ సంస్థ లాభాల బాటలో నడిచినప్పుడే ఉద్యోగులకు భద్రత, మనుగడ ఉంటుందన్నారు. ప్రతి ఉద్యోగి తన వంతు బాధ్యతగా విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించడంతో పాటు సమయపాలనను కచ్చితంగా పాటించాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలను అనుసరిస్తూ ప్రమాద రహిత డ్రైవింగ్ చేయాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని హెచ్చరించారు. ఆర్టీసీ సేవలపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని ఆమె ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా నిజాయితీకి నిదర్శనంగా నిలిచిన చెంగిచెర్ల డిపో కండక్టర్ కే. బాలరాజును ఆమె ప్రత్యేకంగా అభినందించారు. బస్సులో ప్రయాణించిన ఓ మహిళ పోగొట్టుకున్న పది తులాల బంగారు ఆభరణాల బ్యాగ్‌ను పూర్తి నిజాయితీతో తిరిగి అప్పగించినందుకు ఆయనను శాలువాతో సత్కరించారు. ఆర్టీసీ ఉద్యోగులు నిజాయితీ, క్రమశిక్షణకు ప్రతీకలని, ఇలాంటి ఘటనలు సంస్థకు మంచి పేరు తీసుకొస్తాయని రీజినల్ మేనేజర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్) జీ ఎన్ పవిత్ర, డిపో మేనేజర్ కే కవిత, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) రజిత) అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# భారత ప్రభుత్వ అదనపు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా నర్సింగోజు నరేష్ కుమార్

**జయభేరి, మేడిపల్లి, డిసెంబర్ 24:**

భారత ప్రభుత్వ అదనపు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా మేడిపల్లికి చెందిన న్యాయవాది నర్సింగోజు నరేష్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ లా అండ్ జ్యుడిషియల్ శాఖ అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వం తనను స్టాండింగ్ కమిటీ సభ్యులుగా నియమించడం సంతోషకరంగా ఉందని,తన సేవలను గుర్తించి ప్రకటించిన సందర్భంగా ఈ పదవికి పూర్తి న్యాయం చేస్తానని నరేష్‌కుమార్ తెలిపారు. కౌన్సిల్ మెంబర్‌గా నియమించిన కేంద్ర ప్రభుత్వానికి,సహకరించిన సీనియర్ న్యాయవాదులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఇంకా ఎంత మంది ప్రాణాలు పోతే చౌరస్తా విస్తీర్ణం చేస్తారు?

- ప్రజల ప్రాణాలు లెక్కలేదా!
- ప్రజల ప్రాణాలను కాపాడండి
- ఫ్లాప్ కార్డులతో వినూత్న నిరసన చేపట్టిన స్థానిక వాసి రాము
- మా ప్రాణాలను కాపాడండి మహాప్రభూ

**జయభేరి, షాద్‌నగర్ :**




షాద్‌నగర్ చౌరస్తాను వెంటనే విస్తీర్ణం చేయండి అంటూ చౌరస్తాలో సామాన్యుడు రాము వినూత్న రీతిలో ఫ్లాప్ కార్డులతో నిరసనకు దిగారు. లక్షల సంఖ్యలో వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే షాద్‌నగర్ ప్రధాన చౌరస్తా ప్రమాదాలకు అడ్డాగా మారింది. ఈ చౌరస్తా వద్ద ఇప్పటివరకు పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటు చేసుకున్నాయి. గతంలో ఇదే ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి కూతురు మృతి చెందిన ఘటన ప్రజలను కలిచివేసింది. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి చౌరస్తా విస్తీర్ణం చేయాలని రాము డిమాండ్ చేశారు. ఇప్పటివరకు మున్సిపల్ అధికారులకు ఐదు సార్లు ఫిర్యాదు చేశాను. ఆర్ అండ్ బి అధికారుల దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లాను. కానీ ఫలితం మాత్రం శూన్యం. కోర్టు వివాదాలు ఉన్నాయంటూ తప్పించుకుంటున్నారు. ప్రజల ప్రాణాలు పోతున్నా అధికారుల్లో చలనం కనిపించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. చౌరస్తా వద్ద రోడ్డు విస్తీర్ణం, స్పీడ్ బ్రేకర్లు, సిగ్నల్స్, డివైడర్లు సరైన రీతిలో ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ దుర్ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకొని, మరిన్ని ప్రాణాలు పోకుండా విస్తరణ చేపట్టి ప్రజల రవాణా భద్రతను కాపాడాలని షాద్‌నగర్ ప్రజలు గళమెత్తుతున్నారు.

# సోదర, సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు

- దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్



**జయభేరి, దేవరకొండ :**

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని దేవరకొండ నియోజకవర్గ క్రైస్తవ సోదర, సోదరీమణులకు దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ అంటే ఏసు ప్రభువును జ్ఞాపకం చేసుకునే సమయం. విశ్వవ్యాప్తంగా ప్రజలందరిలో ప్రేమ,సహనం, కరుణపూర్వక అనుబంధాలను మేలుకొలుపుతూ ఏసు బోధనలను ఆదరించే సందర్భం. ధర్మం, విశ్వాసపూరితమైన గమనానికి ఏసుక్రీస్తు జీవనం మనందరికీ ప్రేరణనిస్తుంది. ఈ సందర్భంగా క్రైస్తవ సోదర,సోదరీమణులలో శాంతి, సామరస్యం విరాజిల్లాలని ప్రార్థిస్తున్నాను. క్రైస్తవులంతా భక్తి, శ్రద్ధలతో క్రిస్మస్ పండుగను జరుపుకోవాలని క్రైస్తవ సోదర, సోదరీమణులను ఆకాంక్షిస్తున్నాను అని తెలిపారు.



# యాదగిరిగుట్టకు రండి

- వైకుంఠ ఏకాదశి రావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డికి ఆహ్వానం

**జయభేరి, యాదగిరిగుట్ట, డిసెంబర్ 24:**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో జరిగే వైకుంఠ ఏకాదశి,అధ్యయనోత్సవాల్లో పాల్గొనాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని యాదగిరిగుట్ట ఆలయ ఈవో వెంకట్రావు,ఆలయ అర్చకులు, అధికారులు ఆహ్వానించారు. బుధవారం హైదరాబాద్‌లోని సీఎం కార్యాలయంలో కలిసిన ఆలయ అధికారులు ఈనెల 30న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనానికి యాదగిరిగుట్టకు రావాలని, వైకుంఠ ఏకాదశి, అధ్యయనోత్సవాలలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి,మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం, స్వామి వారి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. వైకుంఠ ఏకాదశి రోజున యాదగిరిగుట్టలో భక్తుల కోసం ప్రత్యేక పూజలు,ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాట్లు చేసినట్లు,భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు యాదగిరిగుట్ట ఆలయ ఈవో వెంకట్రావు తెలిపారు.

# పట్టపగలే ఇంట్లో దొంగలు పడ్డారు



**జయభేరి, యాదగిరిగుట్ట, డిసెంబర్ 24:**

యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని గుండ్లపల్లి పట్టపగలే ఓ ఇంట్లో దొంగలు పడ్డారు. బుధవారం యాదగిరిగుట్ట పట్టణ సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం గుండ్లపల్లికి చెందిన సినియర్ విలేఖరి కీసరి కిషన్ ఇంట్లో మధ్యాహ్నం 3 గంటల సమయంలో దొంగతనం జరిగిందని తెలిపారు. ఇంటి యజమాని తన షాపు వద్ద ఉండడంతో మధ్యాహ్నం సమయంలో ఇంటి తలుపుల గొళ్లాలు విరగ్గొట్టి ఇంట్లోకి చొరబడ్డాడని,నేరుగా బీరువా దగ్గరకు వెళ్లి అందులో ఉన్న బంగారు ఉంగరం, రూ.5 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్ పరిశీలించిందని,సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని, త్వరలో దొంగలను పట్టుకుంటామని యాదగిరిగుట్ట పట్టణ సిఐ బాస్కర్ తెలిపారు.

# డిండి రోడ్డు హైవే రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలి



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపాలిటీ లోని డిండి హైవే రోడ్ లో మీనాక్షి సెంటర్ నుండి మైనంపల్లి బ్రిడ్జి వరకు రోడ్డు భవనాల శాఖ రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేయలేక పోవడం వల్ల అక్కడ నుంచి వెళ్లేటటువంటి ప్రయాణికులకు చాలా ఇబ్బంది ఏర్పడుతుందని రోడ్డు భవనాల శాఖ దేవరకొండ జేఈ కి వినతి పత్రం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రోడ్డు పనులు ప్రారంభించి 8 నెలలు కావస్తున్నప్పటికీ ఇంకా పూర్తి చేయక పోవడం వల్ల పట్టణంలో ప్రయాణికులు రాకపోకలలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని , వన్ వే రోడ్డులోనే చాలా వాహనాలు పోవడం వలన ప్రమాదం జరిగే అవకాశం ఉంది కావున రోడ్డు పనులు త్వరితగతంగా పూర్తిచేసి ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా చూడాలని అధికారులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పున్నం వెంకటేష్, పెరికేటి శ్రీనివాసచారి, ఎండి ఖాదర్ బాబా, మకాం చంద్రమౌళి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# హాఫిజ్ తయ్యాబ్ సాబ్ మృతి సమాజానికి తీరని లోటు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణం ఇస్లాంపుర కు చెందిన స్థానిక అఖ్సా మస్జీద్ ఇమామ్, మత పెద్దలు హాఫిజ్ తయ్యాబ్ సాబ్ మృతి సమాజానికి తీరని లోటని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రామావత్ రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. బుధవారం హాఫిజ్ తయ్యాబ్ సాబ్ మృతదేహానికి నివాళులు అర్పించారు. యాభై సంవత్సరాలుగా స్థానిక మస్జిద్ లో ఇమామ్ గా సేవలందించి, పలు రకాలుగా సమాజానికి దోహదపడ్డారని ఆయన మృతి బాధాకరమని, ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట దేవరకొండ ఈద్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీమోద్దీన్, స్థానిక బిఅర్ఎస్ నాయకులు మహ్మద్ ఇలియాస్ పటేల్, మహ్మద్ ఖాదర్ బాబా, మహ్మద్ అఫ్రోజ్, మహ్మద్ జాఫర్, మహ్మద్ నజీర్, యండి షదాబ్, మహ్మద్ ముజ్జు, యండి ఉమేర్, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.



## గోడ కూల్చడంతో దళిత గిరిజన సంఘాల ఆందోళన

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ నియోజకవర్గం కొండ మల్లేపల్లి చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఉన్న గోడను అధికారులు కూల్చడంతో దళిత గిరిజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో ధర్నా నిర్వహించడం జరిగింది బంజారా సినీ హీరో చందు నాయక్ మాట్లాడుతూ విగ్రహం చుట్టూ ఉన్న గోడను తొలగించడంతో యావత్ భారతదేశ దళిత జాతికి అవమానించినట్టు ఉంది అని అన్నారు ఒకవేళ అంబేద్కర్ విగ్రహానికి అభివృద్ధి చేస్తే సమాచారం ఇవ్వకుండా గోడని కూల్చడం అవమానించడం ఏంటి అని అన్నారు ఈ విషయంపై ఎటువంటి వార్తలు లేకపోవడంతో వెంటనే అధికారులు మరమ్మతు చేయాల్సిందిగా హెచ్చరించారు లేనియెడల దళిత గిరిజన సంఘాలు జేఏసీగా ఏర్పడి కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని చందు నాయక్ తెలియజేసినారు.

## శ్రీరాముదాదా స్వామి ని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

- శ్రీరాముదాదా స్వామిని దర్శించుకున్న దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్



జయభేరి, దేవరకొండ :

కల్వపల్లి శ్రీరాముదాదా స్వామిని దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్యదైవం రాము దాదా స్వామి అని, ప్రతి ఒక్కరు రాముదాదా అనుగ్రం పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మడవెల్లి గ్రామ మాజీ సర్పంచ్ లింగం, గ్రామ శాఖ అధ్యక్షుడు లాలయ్య,కిరణ్,తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను సన్మానించిన బిలియా నాయక్



జయభేరి, దేవరకొండ :

మంగళవారం నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగిన BRS పార్టీ తరుపున నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన సర్పంచ్ ల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన BRS పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ కల్వకుంట్ల తారక రామారావుకి శాలువాతో సత్కరించి స్వాగతం పలికిన BRS రాష్ట్ర నాయకులూ కేతావత్ భీల్యానాయక్.

## నిధులు ఇప్పించేదుకు కృషి చేస్తా..



జయభేరి, ఘట్కేసర్ :

GHMC LB నగర్ జోన్ ఘట్కేసర్ సిర్కిల్ పరిధిలో నిర్మిస్తున్న రైల్వే వంతెన నిర్మాణంలో భాగంగా మేడ్చల్ నియోజకవర్గం డీసీసీ అధ్యక్షులు, ఇంచార్జి తోటకూర వజ్రెష్ యాదవ్ ని కలిసి ఘట్కేసర్ మున్సిపల్ మాజీ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, B బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్. ఈ సందర్భంగా మాజీ ఛైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. ఘట్కేసర్ పరిధిలో నిర్మాణం చేస్తున్న రైల్వే వంతెన నిర్మాణం కోసం సంబంధిత కాంట్రాక్టర్ సత్తి రెడ్డికి రావాల్సిన నిధులు 4కోట్ల రూపాయలు ఇప్పించాల్సిందిగా వజ్రెష్ యాదవ్ ని కోరగా ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్కతో చర్చించి నిధులు ఇప్పించేదుకు కృషి చేస్తానని తెలుపుతూ.. ఘట్కేసర్, చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పడుతున్న ఇబంధులను సైతం ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్కకి వివరించి వెంటనే నిధులు విడుదల చేపించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో R&B AE రంజిత్ రెడ్డి, కాంట్రాక్టర్ సత్తి రెడ్డి, మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేష్, మాజీ బ్యాంక్ డైరెక్టర్ బొక్క ప్రభాకర్ రెడ్డి, డీసీసీ కార్యదర్శి ఉల్లి ఆంజనేయులు యాదవ్, మాజీ వార్డు సభ్యులు వెంకటనారాయణ, సల్లూరి నర్సింగ్ రావు, యూత్ అధ్యక్షులు బొక్క సంజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వాడచీపురుపల్లిలో సూర్య ఘర్ యోజన పథకం పై అవగాహన సదస్సు

జయభేరి, పరవాడ:



గృహ విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులను తగ్గించుకునేందుకు వీలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రభుత్వ రాయితీతో సోలార్ రూట్ టాప్ ను ఏర్పాటు చేసుకునేలా అందిస్తున్న ప్రధాన మంత్రి సూర్య యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఈపీడీసీఎల్ కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకృష్ణ సూచించారు. ఈ మేరకు బుధవారం వాడ చీపురుపల్లిలో జరిగిన సూర్య ఘర్ యోజన పథకం అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ పథకం గృహ విద్యుత్ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందని, ఈ పథకం వలన గృహ వినియోగదారులకు అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుందని, ఇంటి పై కప్పు పై కనీసం 10 చ. మీ /100 చ. అ స్థలంలో 1కే డబ్ల్యూపి సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చని,ఈ పథకానికి తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు లభిస్తాయని తెలిపారు. 1 కిలో వాట్ కి రూ. 30 వేలు, 2 కిలోవాట్లకు రూ. 60 వేలు, 3 కిలోవాట్లకు రూ. 78 వేలు ప్రభుత్వ రాయితీస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లులు తగ్గించుకోవడంతో పాటు మిగులు విద్యుత్ ద్వారా కొంత ఆదాయం కూడా వినియోగదారుడికి లభిస్తుందని తెలిపారు.

అలాగే ఎస్సీ ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వమే ఉచితంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసే అవకాశం కూడా కల్పించిందని తెలిపారు.ఇప్పటికే కసింకోట డివిజన్ పరిధిలో 1250 మంది వినియోగదారులు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. మొదటి విడతగా కోటి మంది లక్ష్యంగా ఈ పథకం ముందుకు వెళుతుందని తెలిపారు. ఏపీ ఈపీడీసీఎల్ వెబ్సైట్ ద్వారా పీఎం సూర్యఘర్ పోర్టల్ లో ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సోలార్ రూట్ టాప్ ఏర్పాటు కోసం మరియు విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912 టోల్ ఫ్రీ నెంబర్ ను కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ రాయితీతో అందిస్తున్న ఈ పీఎం సూర్య ఘర్ యోజన పథకాన్ని గృహ విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శివలంక లక్ష్మి,మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు,మాజీ సర్పంచ్ చింతకాయల ముత్యాలు,మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి,ఏడిఈ కనకారావు,డిపిఈ కోటేశ్వరరావు,ఏఈలు శేషసాయి,పైల శ్రీనివాస్, సంస్థ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ సేవకుడిని..

- పీర్జాదిగూడ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తుంగతుర్తి రవి
- కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే నా బలం, పీర్జాదిగూడ ప్రజలే నా బలగం
- సీనియర్ నాయకుల అండదండలు, స్థానిక నాయకుల ప్రోత్సాహమే నాకు వరం
- పార్టీ ఆదేశాలిస్తే ఆచరిస్తా...పీర్జాదిగూడ ప్రజలకు సేవ చేస్తా...

జయభేరి, మేడిపల్లి :

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్లో గత కొన్ని సంవత్సరాలుగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పరమావధిగా అనుక్షణం పార్టీ కోసం, ప్రజల క్షేమం కోసం నిబద్ధతతో పని చేస్తున్న నిత్య కృషివలుడు తుంగతుర్తి రవి. గత కెసిఆర్ పాలనలో ఎన్నో అవమానాలను, కేసులను సైతం ఎదుర్కొని, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే బలంగా, పీర్జాదిగూడ ప్రజలే తన బలగంగా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల అడుగుజాడల్లో వారి అండదండలతో ప్రజా సమస్యలపై పోరాడుతూ కాంగ్రెస్ పార్టీని అభివృద్ధి పథంలో నడిపించారు తుంగతుర్తి రవి. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ గ్రేటర్ హైదరాబాద్ లో విలీనం అయిన తర్వాత పీర్జాదిగూడ సర్కిల్ నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగుతాడని కొన్ని కథనాలు వెలువడుతున్నాయి. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి స్పందిస్తూ నాటి పిసిసి అధ్యక్షుడు, నేటి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్ఫూర్తితో, రాజకీయ రంగ ప్రవేశం చేసి ఆయన అడుగుజాడల్లో నడుస్తున్నాను. టీపీసీసీ అధ్యక్షుడిగా ఆయన చేసిన కృషి ,నేడు రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమం కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలు తనకు మరింత స్ఫూర్తిని సేవా దృక్పథాన్ని పెంపొందిస్తున్నాయని భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో స్థానిక కాంగ్రెస్ నాయకుల సహాయ సహకారాలతో, జిల్లా నాయకుల అండదండలతో రాష్ట్ర నాయకుల ఆదేశాలను, సూచనలు సలహాలను పాటిస్తూ, పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులను అందరిని సమన్వయపరచుకుంటూ పార్టీ కోసం, పీర్జాదిగూడ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సేవకుడిగా, ఒక సైనికుడిగా, నిబద్ధతగల నాయకుడిగా, పీర్జాదిగూడ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పిస్తే, కాంగ్రెస్ పార్టీ నిర్ణయాన్ని శిరసావహిస్తూ పీర్జాదిగూడ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని తుంగతుర్తి రవి అన్నారు.

## నాచారం జీసస్ పవర్ చర్చ్ లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

జయభేరి, ఉప్పల్ :

నాచారం జీసస్ పవర్ చర్చ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు ప్రవీణ్ డేవిడ్, హెబ్సిబా డేవిడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తో పాటు పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఏసు ప్రభువు ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించారని తెలిపారు. కులమతాలకు అతీతంగా పండుగలను జరుపుకోవాలని సూచించారు. పాస్టర్ ప్రవీణ్ డేవిడ్ మాట్లాడుతూ వేడుకలకు 400 మంది పైగా భక్తులు పాల్గొనడం విశేషం అన్నారు. జీసస్ కృపతో ప్రతి ఒక్కరు సంతోషంగా ఆనందంగా ఉండాలని కోరుకున్నారు.

## అభయాంజనేయ స్వామి కమిటీ ఆధ్వర్యంలో మేలుకొలుపు

జయభేరి, పరవాడ:



ధనుర్మాసం విష్ణుమూర్తికి అత్యంత ప్రీతికరమైన మాసం. ఈ మాసంలో మేలుకొలుపు నిర్వహించడం ప్రాచీన సంప్రదాయం. పరవాడ మండలం హనుమాన్ నగర్ శ్రీ అభయ ఆంజనేయ స్వామి కమిటీ ఆధ్వర్యంలో మేలుకొలుపు కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ప్రాచీన సంప్రదాయానికి పెద్దపీట వేస్తున్నారు. గ్రామానికి చెందిన మహిళలు, గ్రామ ప్రజలు పిల్లలు పెద్దలు యువ నాయకులు కలిసి ఒక బృందంగా ఏర్పడి రోజూ సుప్రభాత సేవ చేస్తున్నారు. వేకువజాము 4.30 గంటల నుంచి స్థానిక శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో సుప్రభాత సేవలు ప్రారంభించి మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సీతారాముల చిత్రపటాన్ని మహిళలు పట్టుకుని, రాములవారి పల్లకిలో గ్రామ పురవీధుల్లో భక్తి గీతాలు పాడుతూ, భజన చేస్తూ గ్రామం మొత్తం తిరిగి సూర్యోదయానికి ముందే తిరిగి శ్రీ అభి ఆంజనేయ స్వామి ఆలయానికి చేరుకుంటున్నారు. ధనుర్మాసం మొత్తం ఉదయం, సాయంత్రం రామాలయంలో భజన చేస్తూ భక్తి పాటలు పాడుతున్నారు. ధనుర్మాసం పూర్తయ్యే సరికి భోగి, సంక్రాంతి పండుగలను గ్రామంలో ఘనంగా చేసి ధనుర్మాస వ్రతాన్ని పూర్తి చేస్తారు. అని కమిటీ సభ్యులు లాలం అప్పలనాయుడు పేర్కొన్నారు, భక్తులకు కూండ్రపు అప్పలనాయుడు (జోగమ్మ) తన సొంత నిధులతో మేలుకొలువు కు వచ్చిన భక్తులకు కండువాలు వితరణ చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, సమ్మంగి సోమేశ్వరరావు, ఒలిశెట్టి అప్పలరాజు, కిలపర్తి అప్పలనాయుడు, కణితి సోమేష్, ఎస్ పైడిరాజు, ఎస్ అప్పారావు బేరి, అప్పలరాజు, నెల్లూరు, తాతబాబు, అప్పలనాయుడు, ఈరుగుల శీను , ఈరుగుల అప్పలరాజు, భోగి రాజు, పైల ముత్యాలు, కోరంగి శీను ,డ్వాక్రా మహిళలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసాలో మార్పులు



జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 24:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం అనేక సంస్కరణలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. వీటిల్లో ఒకటి పెట్టుబడి సాయం. ఎకరాకి ఇంత అంటూ ఆర్థిక సాయం అందజేస్తున్నాయి ప్రభుత్వాలు. తెలంగాణలో రైతు భరోసా పేరుతో ఈ పథకం అమలవుతోంది. గతంలో రెండు సీజన్లకు కలిపి ఎకరాకు రూ.10 వేల ఆర్థిక సాయం చేస్తుండగా.. ఇప్పుడు అధికారంలో ఉన్న రేవంత్ సర్కార్ ఎకరాకు రూ.12 వేలు సాయం అందిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకానికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. దీని వల్ల సుమారు 10 లక్షల ఎకరాలకు రైతు భరోసా నిధులు కట్ అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకానికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. యాసంగి సీజన్‌కు సంబంధించి, రైతు భరోసా నిధుల విడుదలలో భాగంగా.. పంటలు వేసిన భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించింది. దీనివల్ల ఈ సంవత్సరం దాదాపు 10 లక్షల ఎకరాల భూములకు రైతు భరోసా అందకపోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నిర్ణయం వల్ల కేవలం సాగు చేసే రైతులకు మాత్రమే రైతు భరోసా పథకం ప్రయోజనం చేకూర్చడం, ప్రభుత్వ ఆర్థిక భారాన్ని తగ్గించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. తాజాగా నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు గాను రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. మొదట్లో ఎకరాకు రూ.4 వేలు ఇచ్చారు. ఆ తర్వాత మరో వెయ్యి రూపాయలు పెంచి.. ఎకరాకు రూ.5 వేలు చొప్పున పెట్టుబడి సాయం అందించింది. అయితే, ఈ పథకం ద్వారా వ్యవసాయం చేయనివారు, బీడు భూములు, కొండలు, గుట్టలు ఉన్న భూములకు కూడా నిధులు అందుతున్నాయని ఆరోపణలు వచ్చాయి. అనర్హులు కూడా లబ్ధి పొందుతున్నారని గుర్తించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, రైతు బంధును.. రైతు భరోసాగా మార్చి.. ఎకరాకు రూ.6 వేలకు పెంచింది. ఈ పథకంలో కూడా అనర్హులు లబ్ధి పొందుతున్నారని రేవంత్ ప్రభుత్వం గుర్తించింది. అందుకే, అర్హులైన రైతులకు, అంటే నిజంగా సాగు చేసే భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో మాట్లాడుతూ.. ఇకపై రైతు భరోసా నిధులను కేవలం సాగు చేసే భూమికే అందించాలని నిర్ణయించాము. సాగుకు అనుకూలంగా లేని భూములకు గతంలో ఇచ్చినట్లుగా పెట్టుబడి సాయం ఇవ్వడం సాధ్యం కాదు అని స్పష్టం చేశారు. ఈ విధానం వల్ల ప్రభుత్వానికి ఆర్థిక భారం తగ్గుతుంది. సాగు చేసే రైతులకు మాత్రమే ప్రయోజనం చేకూరుతుంది.



# సంక్రాంతి బరిలో సంపూర్ణ వినోదం

మెగాస్టార్ నటన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎలాంటి పాత్రనైనా తనదైన అభినయంతో రక్తికట్టిస్తారు. కామెడీని పండించడంలోనూ ఆయన దిట్ట. అయితే గత కొంతకాలంగా మాస్, యాక్షన్ కథలకు ప్రాధాన్యతనిస్తున్న ఆయన వినోదానికి దూరమయ్యారని అభిమానుల్లో కొంచెం అసంతృప్తి ఉంది. ఇప్పుడాలోటుని తీర్చడానికి 'మన శంకరవరప్రసాద్‌గారు'తో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు మెగాస్టార్ చిరంజీవి. ఈ సినిమాలో ఆయన తనదైన వింటేజ్ కామెడీతో అభిమానుల్లో జోష్ నింపబోతున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలు సినిమాపై భారీ హైప్‌ని క్రియేట్ చేశాయి. చిరంజీవి స్వాగ్, దర్శకుడు అనిల్ రావిపూడి తనదైన మార్క్ కామెడీ కలబోతగా ఈ సినిమా సంక్రాంతి బరిలో వినోదాల విందు చేయనున్నదని మేకర్స్ చెబుతున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా ఈ సినిమా కోసం చిరు మేకోవర్ చూసి అభిమానులు ఖుషీగా ఉన్నారు. యంగ్ లుక్‌తో సరికొత్త ఛరిష్మాతో చిరంజీవి కనిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన స్టిల్‌స్‌ని విడుదల చేశారు. ఇందులో తనదైన మ్యాజికల్ ప్రజెన్స్‌తో ఆకట్టుకుంటున్నారు. అగ్ర హీరో వెంకటేష్ అతిథి పాత్ర ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలవనుంది. ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, రచనదర్శకత్వం: అనిల్ రావిపూడి.

# నాలుగో 'ఇడియట్' కోసం



స్నేహం గొప్పతనాన్ని ఆవిష్కరిస్తూ, మన విద్యా వ్యవస్థలోని లోపాలను చర్చిస్తూ సందేశాత్మకంగా రూపొందిన 'త్రీ ఇడియట్స్' చిత్రం తిరుగులేని ఆదరణ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అమీర్‌ఖాన్, ఆర్.మాధవన్, శర్మాన్ జోషి, కరీనా కపూర్ ప్రధాన పాత్రల్లో రాజ్‌కుమార్ హీరానీ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా 2009లో విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. తాజాగా ఈ చిత్రానికి సీక్వెల్ తెరకెక్కించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీనికి '4 ఇడియట్స్' అనే టైటిల్‌ను ఖరారు చేయబోతున్నారని సమాచారం. అమీర్‌ఖాన్, ఆర్.మాధవన్, శర్మాన్‌జోషి సీక్వెల్‌లో కొనసాగుతారని, ఈ త్రయానికి మరో అగ్ర హీరో జత కలుస్తారని బాలీవుడ్ టాక్. ప్రస్తుతం ఆ నాలుగో 'ఇడియట్' అన్వేషణలో చిత్రబృందం ఉందని తెలిసింది. ఈ ఫ్రాంఛైజీని లార్జర్ స్కేల్‌లో రూపొందించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారట. తొలిభాగంలో విద్యా వ్యవస్థ గురించి చర్చించగా, ఈ సీక్వెల్‌లో మరో సామాజికాంశాన్ని ప్రధాన కథా వస్తువుగా తీసుకోబోతున్నారని సమాచారం. వచ్చే ఏడాది ప్రథమార్ధంలో ఈ సీక్వెల్ సెట్స్‌పైకి వెళ్లనుందని వార్తలొస్తున్నాయి.

# ఇండస్ట్రీలో అతనే నాకు గురువు..:

సమంత, నాగ చైతన్యను వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత మనస్పర్థల కారణంగా విడిపోయారు. ఇక విడిపోయిన తర్వాత సమంత, నాగ చైతన్య ఎవరి లైఫ్‌లో వారు బిజీగా ఉన్నారు. ఇదిలా ఉంటే సమంత మాయోసైటిస్ కారణంగా ఏడాది పాటు సినిమాలకు బ్రేక్ తీసుకుంది. ఇక ఇప్పుడు తిరిగి సినిమాల్లో నటించడానికి రెడీ అవుతుంది. ఇదిలా ఉంటే సమంత గతంలో చేసిన కొన్ని కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. టాలీవుడ్ లో తనకు ఓ స్టార్ హీరో గురువు అని తెలిపింది సామ్. టాలీవుడ్ లో సమంత చాలా మంది స్టార్ హీరోల సరసన నటించింది. మహేష్ బాబు, ఎన్టీఆర్, అల్లు అర్జున్ ఇలా చాలా మంది స్టార్ హీరోలతో నటించింది. అలాగే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌తోనూ సినిమా చేసింది సమంత. పవన్ కళ్యాణ్ తో అత్తారింటికి దారేది సినిమా చేసింది. త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా సూపర్ హిట్ గా నిలిచింది. ఈ సినిమాలో పవన్ కు జోడీగా సామ్ నటించి మెప్పించింది. అలాగే గతంలో ఓ ఇంటర్వ్యూలో సమంత మాట్లాడుతూ.. ఈ చిత్రంలో పవన్ తో మంచి సాన్నిహిత్యం ఏర్పడిందని సమంత తెలిపింది. అలాగే షూటింగ్ సమయంలో తీసిన ఓ ఫోటో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యింది. ఆ ఫోటోలో సమంతను పవన్ ఆశీర్వదిస్తూ కనిపించారు. దీని గురించి సమంత మాట్లాడుతూ.. పవన్ నా గురువుగారు అని చెప్పింది. స్విట్జర్లాండ్ లో షూటింగ్ జరుగుతున్నప్పుడు సరదాగా తీసిన ఫోటో అది అని.. పవన్ కళ్యాణ్ నటుడు కాకపోయి ఉంటే నాకు గురువుగా ఉండమని కోరే దాన్ని అంటూ సమంత తెలిపింది.



# హిట్ కోసం ఎదురుచూస్తున్న అమ్మడు..



క్రమంగా ఇండస్ట్రీలో కనిపించకుండాపోతారు.. కానీ ఈ హీరోయిన్ రూటే సపరేట్. 20ఏళ్లుగా ఒక్క హిట్ అందుకోలేకపోయింది.. ఇరవై ఏళ్లకు పైగా సినీ ఇండస్ట్రీలో ఉంది ఈ ముద్దుగుమ్మ. అలాగే ఇరవై ఏళ్లుగా హిట్స్ మాత్రం అందుకోలేకపోయింది. కానీ ఆమె క్రేజ్ మాత్రం ఎక్కడ తగ్గలేదు. అందంలో అప్సరస.. గ్లామర్ డోస్ కూడా ఎక్కువే.. కానీ అదృష్టం మాత్రం దక్కలేదు ఈ చిన్నదానికి.. ఇంతకూ ఆమె ఎవరంటే.. బాలీవుడ్ ముద్దుగుమ్మ చిత్రాంగదా సింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 2005లో హజారోన్ ఖ్వాషీన్ ఐసీ అనే క్రైమ్ డ్రామాతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. మోడలింగ్ నుంచి హీరోయిన్ గా మారింది ఈ చిన్నది. హీరోయిన్ గానే కాదు నిర్మాతగానూ చేసింది. 2018లో సూర్మా అనే స్పోర్ట్స్ డ్రామాకు నిర్మాతగా వ్యవహరించింది. ఇటీవలే హౌస్‌ఫుల్ 5 సినిమాలోనూ కనిపించింది ఈ ముద్దుగుమ్మ. సినీ కెరీర్ లో చిత్రాంగదా సింగ్ తొమ్మిదేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉంది. ఆ సమయంలో ఎన్నో బ్లాక్ బస్టర్ హిట్స్ మిస్ చేసుకుంది. అలాగే ఇటీవల ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఆసక్తికర కామెంట్స్ చేసింది. కెరీర్ లో నేను ఎన్నో తప్పులు చేశాను. నేను ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలను మిస్ చేసుకున్నా.. గ్యాంగ్‌స్టర్ సినిమా నేను రిజెక్ట్ చేశా.. అంతే కాదు తను వెడ్స్ మను సినిమాను కూడా నేను మిస్ చేసుకున్నా.. మంగల్ పాండే'లో అమీషా పటేల్ చేసిన పాత్రను కూడా నేను రిజెక్ట్ చేశా.. అని తెలిపింది.

# 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'



మాస్ మహారాజ్ రవితేజ హీరోగా తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని క్రియేట్ చేస్తోంది. SLV సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మాణంలో, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌కు పేరున్న దర్శకుడు కిశోర్ తిరుమల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తుండగా, సినిమా మొత్తం ఎంటర్‌టైన్‌మెంట్‌పై గట్టి ఫోకస్ పెట్టినట్లు ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ చెబుతోంది.ఇప్పటికే ఈ సినిమా నుంచి గ్లింప్స్, పాటలు రిలీజ్ అయి పాజిటివ్ రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. తాజాగా మేకర్స్ టీజర్‌ను విడుదల చేయగా, ఇది సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది. టీజర్ చూస్తే, రవితేజ క్యారెక్టర్ చుట్టూ తిరిగే ఫుల్ టెన్షన్ కామెడీకి సినిమా సిద్ధమవుతోందన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది. టీజర్‌లో హీరోకు భార్య ఉండగానే మరో అమ్మాయి జీవితంలోకి రావడం, ఒకరికి తెలియకుండా మరొకరితో ఎలా వ్యవహరించాల్సి వస్తుందో, ఆ క్రమంలో హీరో ఇద్దరి మధ్య ఎలా నలిగిపోతాడో సరదాగా చూపించారు. ఒక చిన్న పొరపాటు నుంచి మొదలయ్యే పరిస్థితులు ఎలా పెద్ద సమస్యలుగా మారతాయన్న పాత సూపర్ హిట్ ఫార్ములాను, రవితేజ స్టైల్ కామెడీ టైమింగ్‌తో కొత్తగా ప్రెజెంట్ చేసినట్లు టీజర్‌లో కనిపిస్తోంది. డబుల్ రోల్ టెన్షన్, అపార్థాలు, దాచిపెట్టే ప్రయత్నాలు, అనుకోని ట్విస్టులతో సినిమా మొత్తం నవ్వులు పూయించబోతుందన్న హింట్ టీజర్ ఇస్తోంది.

రవితేజ ఎనర్జీ, కామెడీ టైమింగ్ మరోసారి ఈ సినిమాకు ప్రధాన బలంగా నిలవబోతుందని అభిమానులు అంటున్నారు. డింపుల్ హయతి, ఆషిక రంగనాథ్ పాత్రలు కూడా కథలో కీలకంగా ఉండబోతున్నాయని, ఇద్దరి మధ్య హీరో ఇరుక్కునే సన్నివేశాలు ప్రేక్షకులను బాగా ఎంటర్‌టైన్ చేస్తాయని టీజర్ ద్వారా అర్థమవుతోంది. కిశోర్ తిరుమల గతంలో తెరకెక్కించిన ఫ్యామిలీ డ్రామాలు, రిలేషన్‌షిప్ ఆధారిత కథల అనుభవం ఈ సినిమాకు అదనపు ప్లస్‌గా మారనుంది. సినిమా టెక్నికల్ అంశాల పరంగా కూడా మంచి క్వాలిటీ కనిపిస్తోంది. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, ఎడిటింగ్, విజువల్స్ అన్నీ టీజర్‌లో బాగానే వర్క్ అయ్యాయి. ముఖ్యంగా కామెడీ సీన్స్‌కు సరైన పేస్ సెట్ చేసిన విధానం సినిమాపై అంచనాలు పెంచుతోంది.'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సినిమాను మేకర్స్ సంక్రాంతి కానుకగా జనవరి 13న థియేటర్లలో విడుదల చేయనున్నారు. పండుగ సీజన్‌లో ఫ్యామిలీ ఆడియెన్స్‌ను టార్గెట్ చేస్తూ వస్తున్న ఈ టెన్షన్ కామెడీ ఎంటర్‌టైనర్, రవితేజ కెరీర్‌లో మరో హిట్‌గా నిలుస్తుందేమో చూడాలి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**